క్లుప్తంగా

నేడు మండలానికి ఎంపీ రాక

ఊట్కూరు: మండలంలోని ముగ్దంపూర్ గ్రామంలో సోమవారం ప్రారంభించే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ హాజరవుతారని బీజేపీ జిల్లా ప్రధాన కారదర్శి భాస్కర్, మండల అధ్యక్షుడు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ జెండా ఆవిష్కరణ, అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తారని, మండలంలోని కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు బీజేపీ కార్యాలయం ప్రారంభం

కోస్గి: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూర్ ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా సోమవారం బీజేపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు నూతన పార్టీ కార్యాలయంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఎంపీ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగాధర్



మాగనూర్: మాగనూర్ మండల మహిళా సమైక్యలో సీసీగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు మండల సమైక్య సభ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

నారాయణపేట: ఇటీవల కర్ణాటకలోని రాయచూర్ మాన్వి బైపాస్ రోడ్డులో బస్సుఢీకొని గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వాటికి సంబంధించిన గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన నారాయణపేట జిల్లా గొర్రెల కాపరులు, రైతులు గొర్రెలను మేపు కోసం తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం కొనసాగిస్తారని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో మాన్వి బైపాస్ రోడ్డు దగ్గర రైల్వే బ్రిడ్జిపై కర్ణాటకకు చెందిన ప్రైవేట్ బస్సు (విజయనంద్ ట్రావెల్స్) ఢీకొని 155 గొర్రెలు మృత్యువాత పడినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం ఓబులాపురానికి చెందిన పూజారి సీనప్ప, లక్ష్మీపురం అనంతమ్మ, గంట మల్లేష్‌లను ఆదుకోవాలని బస్సు ట్రావెల్ యజమానులను సంప్రదించినట్లు తెలిపారు. ట్రావెల్ యజమాని మానవత్వం మరిచి ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోమనడం దారుణమని తెలిపారు. ట్రావెల్స్ యజమాని నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా ఐదు లక్షల చొప్పున ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆదుకోవాలని కోరారు.

పైపు కట్ చేశారు.. మరమ్మతు మరిచారు



మక్తల్: మున్సిపాలిటీ పరిధిలో 8వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో జగ్జీవన్ రావు కాలనీల్లో తాగునీటి పైపును కట్ చేశారు. చాలా రోజులు గడుస్తున్న పైపులైన్‌కు మరమ్మతు చేయకుండా వదిలేశారు. దీంతో లీకేజీ ఉన్న పైపులో మురుగు వెళ్తోందని, వాటి వల్ల వ్యాధులకు గురవుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



మద్దూరు: నారాయణపేట సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందప్పకు ఆదివారం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ అంజప్ప, దళిత సంఘాల నాయకులు కృష్ణ, ఎల్లప్ప, రాములు, ఈశ్వరమ్మ, ఉజ్వల, శ్రీనివాస్, సామెలు, తదితరులు పాల్గొన్నారు.

ఇవేం మలుపులు..?



ప్రమాదకరంగా ఉన్న వద్వాట్ - అడవిసత్యరం రోడ్డు మూలమలుపు

- సూచిక బోర్డులు లేక ప్రమాదాలు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: మండలంలో పలు ప్రధాన మలుపులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వివిధ వాహనాలు రద్దీగా వెళ్లే వద్వాట్ -మందిపల్లి ప్రధాన దారిలో మలుపులు ఉండటంతో రెప్పపాటులోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన మలుపులు వద్ద పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తవారు ప్రమాదాలకు గురవుతున్నారు. వద్వాట్ శివాలయం సమీపంలో ట్రాక్టర్- ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. అడవి సత్యరం - కోల్పూర్ ప్రధాన మూల మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉజ్జెల్లి మార్గంలో మూల మలుపులు ఉండటంతో ద్విచక్ర వాహనాలు ఢీకొంటున్నాయి. మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు

మండలంలో ఆయా గ్రామాలకు వెళ్ల రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాద్వట్ నుంచి అడవిసత్యరం మీదుగా మందిపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీంతో ద్విచక్రవాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.



ఉజ్జెల్లి గ్రామంకు వెళ్లు రోడ్డు ఇలా..

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. జీబ్రా గుర్తులు వేయాలి. రాత్రి వేళల్లో రేడియం స్టిక్కరింగ్ కనిపించే విధంగా రోడ్లకు ఇరువైపులా వేయాలి. రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– బసంత్‌రెడ్డి వద్వాట్ గ్రామస్తుడు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



మలుపులు కనిపించకపోవడంతో రాత్రి సమయంలో కటింగ్ కాక, ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కిందపడి గాయాలవుతున్నాయి. వద్వాట్–అడవిసత్యరం గ్రామాల మధ్య రహదారి ప్రమాదకరంగా తయారైంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందించకపోవడంతో ప్రమాదాలు ఆగడం లేదు.

– అశోక్‌గౌడ్, మాగనూర్

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..



మూలమలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాల మాట వాస్తవమే. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాత రోడ్డు కావడంతో మొదట్లో ఏర్పాటు చేసినవి ప్రస్తుతం లేవు. అతి త్వరలోనే పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరిస్తాం.

– మారుతి, ఇన్‌చార్జి పంచాయతీ రాజ్ ఏఈ, మాగనూర్

విజేతలకు బహుమతుల ప్రదానం

నారాయణపేట: ప్రజ్ఞ వికాస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక పోటీల విజేతలకు ముచింతల్లో శనివారం రాత్రి త్రిదండి చిన్న జీయర్ స్వామి బహుమతులు అందించారు. మాతృభూమికి, జాతీయ నాయకులకు, దేశ సరిహద్దుల్లో సైనికులకు కృతజ్ఞతలు అనే అంశాలపై ఇంగ్లిష్, తెలుగు మీడియంలో వేర్వేరుగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ చిన్నారులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఈ మేరకు పోటీల్లో పాల్గొని శ్రీ హంస వాహిని, కృష్ణ గోకులం, శ్రీసాయి స్కూల్‌కు చెందిన ఎల్లప్ప, మహేందర్ నాయక్, సోను రాథోడ్, లావణ్య, భాను, మీనాక్షి, దీపిక, అర్పిత, నితిన్ కుమార్‌లు ప్రతిభ చూపి నగదు పురస్కారాలకు ఎపికయ్యారు. వారికి స్వయంగా త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో తస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి రాజేష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు నరసింహ, సుజాత, నమ్రత పాల్గొన్నారు.



జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందిస్తున్న చిన్న జీయర్ స్వామి

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



మక్తల్‌లో పూర్వ విద్యార్థి అనిల్‌కు రూ.1.25 లక్షలు అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ తిరుపతిరెడ్డి

మక్తల్: మండలంలోని సంగంబండ గ్రామానికి చెందిన కృష్ణవేణి పాఠశాల పూర్వ విద్యార్థి అనిల్ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల డైరెక్టర్ ఎంఏ సత్తార్, తిరుపతిరెడ్డి, అబ్దుల్ వహిద్‌లు ఆదివారం మక్తల్‌లో బాధితుడికి రూ.1.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. పాఠశాల యాజమాన్యం పేదవారికి తమవంతు సాయం చేయాలని మానవత దృక్పథంతో ముందుకొచ్చారు. చికిత్స కోసం తమకు చేతనైనంత వరకు మరింత సాయం చేస్తామని తెలిపారు. ఆపదలో ఉన్న పూర్వ విద్యార్థి అనిల్‌కు సాయం అందించడంపై పలువురు ఉపాధ్యాయులు, నాయకులు, పాఠశాలల యాజమానులు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తిరుపతిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఎంఏ సత్తార్, తిరుపతిరెడ్డి, అబ్దుల్ వహిద్, ప్రిన్సిపల్ భాస్కర్‌గౌడ్, డైరెక్టర్ మాదవి, మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, బాధితుడి తల్లిదండ్రులు ఉన్నారు.

పాఠశాలకు కలర్ ప్రింటర్ అందజేత

దామరగిద్ద: విద్యాభివృద్ధికి తమ వంతు సహాయంగా మండలంలోని సజనాపూర్ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలకు కలర్ ప్రింటర్ అందజేశారు. విద్యార్థులకు నిర్వహించే వివిధ పరీక్షలు అసైన్‌మెంట్లతో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపయోగ పడుతుందని పాఠశాల ఎచ్ఎం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ దాతలను అభినందించారు. ఉపాధ్యాయులు శశిధర్, ఏఈఓ గోపాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అమలారెడ్డి, హన్మంతు, భరత్, ఆంజనేయులు పాల్గొన్నారు.



పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

కోల్పూర్‌లో భారీ చోరీ?



మాగనూర్: మండలంలోని కోల్పూర్‌లో బంగారు, వెండి, నగదు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. కోల్పూర్ గ్రామానికి చెందిన కుర్వ ఎల్కోటి శరణమ్మ, కూమారుడు సంజయ్ కుమార్‌తో కలిసి ఈ నెల 16న ఇంటికి తాళం వేసి ముంబైకి వెళ్లారు. సంజయ్ కుమార్ ఆదివారం గ్రామానికి రాగా, ఇంటి తాళం విరగొట్టి ఉంది. ఇంట్లో బీరువా తాళం విరగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు, 55 తులాల వెండి, మూడు లక్షల నగదు దుండగులు చోరీ చేశారు. దీంతో మాగనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ పి.అశోక్ బాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా, సంజయ్ కుమార్ ఇంట్లో ఎటువంటి దొంగతనం జరగలేదని పేర్కొన్నాడు. ఆదివారం రాత్రి 8 గంటల తర్వాత కూడా దర్యాప్తు చేస్తుండటంతో దొంగతనం జరిగిందా, లేదా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

అమరచింత: మండలంలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం వస్తున్నారని ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాగల్ కద్మూర్, అమరచింతలో మహాలక్ష్మి పథకంలో భాగంగా లబ్దిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల మహిళలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఆత్మకూర్‌లోని అంబేడ్కర్‌నగర్ వినాయకుడి నిమజ్జనోత్సవం

గంగమ్మ ఒడికి మహా గణనాథులు

- రూ.2.50 లక్షలకు లడ్డు వేలం
- వేలాదిమంది భక్తులమధ్య నిమజ్జనోత్సవం

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని అంబేడ్కర్ నగర్, ఇంద్రానగర్, వినాయక నగర్, తెలుగు వీధిలో ఏర్పాటు చేసిన మహా గణనాథులను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం గంగమ్మ ఒడికి చేర్చారు. వినాయక నగర్‌లో జరిగిన లడ్డు వేలం పాటలో తెలుగు నాగేష్ రూ.2.50 లక్షలకు దక్కించుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్రగీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనోత్సవంలో నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మదనాపురం: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా భక్తులతో పూజలందుకున్న గణనాథుడు ఆదివారం నిమజ్జనానికి బయలు దేరాడు. మండలంలోని దుప్పల్లిలో గణపయ్య 15రోజులు పూజలందుకున్నాడు. ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రజలు, భక్తులు, మహిళలు బొడ్డెమ్మలు, కోలాటాలు వేస్తూ, భజనలు చేస్తూ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.



ఆత్మకూర్‌లోని ఇంద్రానగర్ వినాయకుడి నిమజ్జనోత్సవం

మూతబడిన పాఠశాలలు తెరిపిస్తాం

కృష్ణా: మండలంలో మూతబడిన పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించేందుకు కృషి చేస్తామని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు డీ శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ శేఖర్ ముడుమాల్, గౌరవ అధ్యక్షుడిగా శివరాజ్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, అసోసియేట్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ పాటిల్, ఉపాధ్యక్షులుగా తిరుమలరావ్, షాహిన్, పుష్ప, కార్యదర్శిగా రామకృష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే మూతపడ్డ వాసునగర్, టైరోడ్డు, సూకూర్ లింగంపల్లి, అడవి ఖానాపూర్ పాఠశాలను పునః ప్రారంభించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఉపాధ్యాయుల్లో జవాబుదారి తనం పెంచి, విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సిద్దప్పగౌడ, తిరుపతి, రఘువీర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నూతన మండల కమిటీ సభ్యులు

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి



మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మక్తల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత ప్రభుత్వం కార్మికులకు రెండు వేల రూపాయలు పెంచడం జరిగిందని, నేటి వరకు చెల్లించలేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోవిందురాజు, కార్మికులు ప్రమీల, లక్ష్మీదేవమ్మ, మంగమ్మ, లక్ష్మి, వంకరమ్మ, మహిమూద, ఉమాదేవి, వెంకటమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మక్తల్: తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మక్తల్‌లో వివేకానంద చౌరస్తాల్లో హిందువాహిని, వివిధ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లడ్డులో నెయ్యిలో కుళ్లిన ఎముకల నూనెను, జంతువుల కొవ్వును కలిపి సరఫరా చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్, వివిధ ధార్మిక సంఘాల నాయకులు విజయకృష్ణ, ఉడిపి పిఠాధి సభ్యులు రాఘవేంద్ర, రఘుప్రసన్నభట్, కావాలి వెకటేష్, సోంశేఖర్‌గౌడ్, నర్సింహారెడ్డి, అంజిరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్, నాగప్ప, రాంయాదవ్, మంజునాథ్, కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.



మక్తల్‌లో ధర్నా చేస్తున్న వివిధ ధార్మిక సంఘాల నాయకులు

నర్వ యువకుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరిస్తున్న నర్వ యువకుడు రాఘవేంద్ర

నర్వ: మండలంలోని లక్కర్‌దొడ్డి గ్రామానికి చెందిన రాఘవేంద్ర తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ అమృత్‌రావు ఎడ్యుకేషన్ సొసైటీ, వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్, ట్యాక్సీఫిల్లింగ్ ఇండియా వారు ప్రతి ఏటా విద్యారంగంలో కృషి చేసిన వారికి అందించే అవార్డుకు నర్వ మండల యువకుడు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహించిన ఉత్సవాల్లో ఈ అవార్డు ప్రదానం చేసినట్లు ఆయన 'సాక్షి'తో తెలిపారు. ఆరేళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అకాడమిక్ అధికారిగా, లీడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. రాష్ట్ర బీసీ స్టడిసర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీజీపీఎస్‌సీ గ్రూప్ 1 మేన్స్ ఎక్సామ్స్ సెలెక్ట్ అయిన అభ్యర్థులకు శిక్షణను ఉస్మానియా యనివర్సిటీలో ఆయన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడంపై నర్వ మండల విద్యావేత్తలు, లక్కర్‌దొడ్డి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న భారత్

మరికల్: అభివృద్ధిలో భారతదేశం దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.



మరికల్‌లో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి



ఇళ్ల మధ్యనే పారుతున్న మురుగు

కాల్వలు లేక కంపుకొడుతున్న కాలనీలు

కోస్గి: పట్టణంలోని 11వ వార్డు పరిధిలో బహార్‌పేటలో మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు చేరి కంపుకొడుతోంది. మురుగులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అసంపూర్తిగా డ్రెయినేజీలు నిర్మించి పైకప్పు వేయకపోవడంతోపాటు కొన్నిచోట్ల దోమల బెడద ఉధృతమైంది. బహార్‌పేట, వేపూర్ కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి మురుగును తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

మక్తల్: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డులో, మాదన్‌పల్లి, గుడిగండ్ల, రామసముద్రం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, అర్బన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ప్రసన్నరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగప్ప, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.



గుడిగండ్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న కొండయ్య

మాగనూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండ్ల లక్ష్మీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మపల్లి, వద్వాట్ గ్రామాల్లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కృష్ణా: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరం చేసినట్లు బీజేపీ జిల్లా నాయకుడు మజ్జిగ సురేష్, మండల ప్రధాన కార్యదర్శి నర్సప్పలు తెలిపారు. మండలంలోని కుసుమర్తి, తంగిడి గ్రామాల్లో బూత్‌ల వారీగా పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, శంకరయ్యశెట్టి, హన్మంత్‌రాయ, మహేష్, బస్‌లింగ, మోహన్‌కుమార్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



అమ్మపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు



కుసుమర్తిలో బీజేపీ సభ్యత్వం చేపట్టిన నాయకులు